ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 సిద్దిపేట
ఆదివారం 14 సెప్టెంబరు 2025



మిట్టపల్లి ఆర్చ్ ఫార్మాలో అగ్నిప్రమాదం 6
● నలుగురు కార్మికులకు గాయాలు
యూరియా కోసం రైతుల రాస్తారోకో 7






రిటైర్‌మెంట్ తర్వాత బోధిస్తున్న ఉపాధ్యాయుడు కొంక శేఖర్

## మాస్టార్లు

రిటైర్‌మెంట్ తర్వాతా విద్యాబోధన

ఆదర్శంగా నిలుస్తున్న రాజగోపాల్‌పేట ఉపాధ్యాయుడు

అన్నింటా.. 'అందె' వేసిన చేయి చేర్యాల ప్రభుత్వ టీచర్‌ది

పేద విద్యార్థుల దత్తత..
సామాజిక సేవలోనూ ముందడుగు



చేర్యాలకు చెందిన అందె విజయ్‌కుమార్

సండే స్పెషల్ Sunday Special 7లో










# అంధ బాలుడికి రూ.7.50 లక్షలు సాయం చేసిన జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఓ అంధ విద్యార్థి పౌరాణిక కథలు చెబుతూ, పాటలు పాడే విధానాన్ని చూసి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి మంత్రముగ్దుడయ్యారు. మూడేళ్ల వయస్సులో చూపును కోల్పోయిన కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గం గాంధారి మండలం లోంకాతండాకు చెందిన వికాస్ నాయక్ నిజామాబాద్‌లోని స్నేహ సొసైటీకి చెందిన అంధుల పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. అతడు అద్భుతమైన గొంతుతో పాటలు పాడటం, కొమరెల్లి మల్లన్న, బీరప్ప, రాముడు, సీత, హనుమంతుడు తదితర పౌరాణిక కథలు పాటల రూపంలో దారాళంగా చెప్పడంతో జగ్గారెడ్డి మురిసిపోయారు. అయితే, రెండు కిడ్నీలు పాడై రెండు సంవత్సరాలుగా తీవ్ర అనారోగ్యం పాలైన వికాస్ తండ్రి చికిత్స కోసం చేసిన అప్పులు తీర్చడానికి జగ్గారెడ్డిని కలసి సహాయం అడగాలని తన తల్లి, తాతయ్య, అమ్మమ్మ, పెద్దమ్మలతో కలిసి శనివారం ఆ విద్యార్థి సంగారెడ్డికి వచ్చాడు. తన కోసం, తన తండ్రి చికిత్స కోసం చేసిన రూ. 6లక్షల అప్పు, వడ్డీ లక్ష రూపాయలు అయ్యిందని, ఆర్థిక సహాయం చేయాలని జగ్గారెడ్డిని కోరాడు. తక్షణమే స్పందించిన జగ్గారెడ్డి రూ. 7.50 లక్షల నగదు అందించారు. పాటలు, పౌరాణిక గాధల్లో పద్యాలను అలవోకగా వికాస్‌నాయక్ చెప్పిన తీరును చూసి జగ్గారెడ్డి అభినందించారు. తానే స్వయంగా యూ ట్యూబ్ చానల్ పెట్టుకుంటానని, తనకు సపోర్ట్ చేయాలని ఆ విద్యార్థి జగ్గారెడ్డిని కోరారు. వెంటనే జగ్గారెడ్డి కొత్త స్మార్ట్ ఫోన్ తెప్పించి ఇవ్వడమే కాకుండా యూట్యూబ్ ఛానల్ ఏర్పాటుకు సహకరిస్తానన్న తెలిపారు. తాను బాగా చదువుకొని కలెక్టర్ అవుతానని వికాస్ జగ్గారెడ్డికి చెప్పాడు. ఇకపై తమ ఇంట్లో జరిగే ప్రతీ కార్యక్రమంలో పాటలు పాడేందుకు ఆ విద్యార్థిని పిలిపిస్తానన్న జగ్గారెడ్డి తెలిపారు.



అంధ బాలుడికి రూ.7.50లక్షలు ఆర్థిక సాయం అందజేస్తున్న జగ్గారెడ్డి, వికాస్‌ను అభినందిస్తున్న జగ్గారెడ్డి

# శాశ్వత కాల్వలను నిర్మించాలి

● మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట నియోజకవర్గంలో ఈ సారి యాసంగికి తలెత్తిన సమస్యలు వచ్చే వానాకాలం, యాసంగి పంటకు ఉండకుండా చూడాలని, శాశ్వత కాల్వల నిర్మాణం చేపట్టాలని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు నీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు. శనివారం సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈసారి 50 వేల ఎకరాలకు సాగు నీరు ఇచ్చామని, పెరిగిన ఆయకట్టు దృష్ట్యా ఆర్‌డీ-7, 8, 9 కాలువలు త్వరితగతిన పూర్తి చేయాలని రంగనాయకసాగర్, మల్లన్నసాగర్ అనుసంధానం చేయాలని సూచించారు. ఇర్కోడ్ లిఫ్ట్ పనులు వేగవంతం చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. చంద్లాపూర్ లిఫ్ట్ పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. నంగునూరు మండలంలో నిర్మించనున్న ఘన్‌పూర్ పంప్‌హౌస్ పనులు చివరి దశలో ఉన్నాయని, త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావలన్నారు. కస్తూరిపల్లి, గోపులాపూర్ చెక్‌డ్యామ్ పనులు ప్రారంభం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ ఎస్ఈ సుధాకిరణ్, డీఎస్ఈ నాగరాజు, రంగనాయకసాగర్ ఈఈ గోపాలకృష్ణ, అనంతగిరి రిజర్వాయర్ ఈఈ రమేష్, మల్లన్నసాగర్ ఈఈ శంకర్, డీఈ చంద్రశేఖర్, ఏఈఈ ఖాజా తదితరులు పాల్గొన్నారు.



చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు, ఎమ్మెల్సీ దేశపతి

### చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి చాలా గొప్పది

సిద్దిపేట రూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి చాలా గొప్పదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. శనివారం సిద్దిపేట రూరల్ మండలం చింతమడక గ్రామంలో చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, సూడా మాజీ ఛైర్మన్ రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బాలకిషన్‌రావు, ఆత్మ కమిటీ మాజీ ఛైర్మన్ ప్రభాకర్‌వర్మ, మాజీ సర్పంచ్ హంసకేతన్‌రెడ్డి, డీసీఎంఎస్ కనకయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బాలికపై టీచర్ అత్యాచారయత్నం

● ములుగు మండలంలోని ప్రైవేటు స్కూల్‌లో చోటుచేసుకున్న ఘటన
● వారం తర్వాత వెలుగులోకి..

ములుగు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బాలికపై ఓ టీచర్ అత్యాచారయత్నానికి పాల్పడిన సంఘటన వారం తర్వాత వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. ములుగు మండలం లక్ష్మక్కపల్లి గ్రామ శివారులోని వెరిటాస్ సైనిక్ స్కూల్‌లో సెప్టెంబర్ 4న ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎనిమిదో తరగతి చదువుతున్న ఓ బాలిక ఈ కార్యక్రమానికి సంబంధించిన సామగ్రి సర్దడానికి తోటి విద్యార్థులతో స్కూల్‌లోని ఓ గదిలోకి వెళ్లింది. ఇది గమనించిన ఉపాధ్యాయుడు పిల్లలందరినీ గదిలో నుంచి బయటికి పంపి ఆ బాలికను బంధించి అత్యాచారయత్నానికి ప్రయత్నించాడు. ఈ విషయం స్కూల్ యాజమాన్యం బయటకు తెలియకుండా జాగ్రత్త పడింది. కానీ, బాలిక ఈ నెల 9న తల్లిదండ్రులతో కలిసి ఉపాధ్యాయుడు, స్కూల్ యాజమాన్యంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు అత్యాచారయత్నానికి పాల్పడిన ఉపాధ్యాయుడిని 11న అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారం క్రితం జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూడడమే కాకుండా, స్కూల్ యాజమాన్యం దాచి ఉంచిన విషయం తెలిసి విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన పడుతున్నారు. ఈ విషయంపై ఎంఈవో ఉదయ్‌భాస్కర్ వివరణ కోరగా ఈ ఘటన జరిగింది వాస్తవమేనని తనకు ఆలస్యంగా తెలిసిందని తెలిపారు.

### టీజీ ఆర్టీసీ యాత్రాదానం

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి) : సామాజిక బాధ్యతలో భాగంగా టీజీఆర్టీసీ యాత్రాదానం పేరిట నూతన కార్యక్రమం అమలుకు శ్రీకారం చుట్టినట్టు ఆర్టీసీ మెదక్ రీజినల్ మేనేజర్ విజయభాస్కర్ తెలిపారు. దాతలు ఇచ్చే విరాళాల ఆధారంగా ఉచిత ప్రయాణ బస్సు సదుపాయం కల్పించనున్నట్టు తెలిపారు. దాతలు ఇచ్చే విరాళాల ఆధారంగా ఉచిత ప్రయాణ బస్సు సదుపాయం కల్పించనున్నట్టు తెలిపారు.



వర్గల్ మండల పరిధిలో నీట మునిగిన పంట

# 7 వేల ఎకరాలకుపైగా.. పంట నష్టం

అధికారుల ప్రాథమిక అంచనా

మరో 270 ఎకరాల్లో ఇసుక మేటలు

ఎస్‌డీఆర్ఎఫ్ నిధులతో తొలగింపు

తుది నివేదికపై అధికారుల కసరత్తు

నష్టపరిహారం చెల్లింపుపై రైతుల్లో ఆశలు

సిద్దిపేట సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మూలిగే నక్కపై తాటి కాయ పడ్డట్టుగా మారింది జిల్లాలోని రైతుల పరిస్థితి. ఓ వైపు తీవ్ర యూరియా కొరతతో రైతులు సతమతమవుతుంటే మరోవైపు కుండపోత వర్షాలు విలవిలలాడేలా చేశాయి. పలు ప్రాంతాల్లో పొలాల్లోకి వరద నీరు చేరడం, ఇసుక మేటలు వేయడంతో పంట దెబ్బతిని విలపిస్తున్నారు. పంట నష్టం వివరాలను సేకరించి త్వరితగతిన ప్రభుత్వానికి నివేదిక అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ నష్టం అంచనాలో నిమగ్నమయ్యారు. అయితే, రాష్ట్ర ప్రభుత్వం ఎకరానికి రూ.10వేలు నష్టపరిహారం అందించేందుకు సిద్ధమవుతోందన్న వార్తలతో రైతులు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు.

### క్షేత్రస్థాయిలోకి అధికారులు

జిల్లాలో వ్యవసాయ శాఖ అధికారులు, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టం అంచనా వేస్తున్నారు. ఈ మేరకు అత్యధికంగా వర్షపాతం నమోదైన మండలాలు, గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్నారు. నష్టపోయిన రైతు పేరు, సర్వే నంబర్, రైతు పాస్‌బుక్ వివరాలు, రైతు అకౌంట్ నంబర్, పంట నష్టం జరిగినట్లు ఫొటో తదితర వివరాలను సైతం సేకరించి నమోదు చేస్తున్నారు.



వరి చేనులో ఇసుక మేట

### 91 గ్రామాల్లో 2,600 మంది రైతులకు నష్టం

జిల్లాలోని వర్గల్, మర్కుక్, ములుగు తదితర ప్రాంతాల్లో వర్షం బీభత్సం సృష్టించగా, మొదట దాదాపుగా 4 వేల ఎకరాల్లో పంట నష్టం వాటిలినట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఆ తర్వాత సిద్దిపేట అర్బన్, సిద్దిపేట రూరల్, గజ్వేల్, అక్బర్‌పేట-భూంపల్లి, తొగుట, దౌల్తాబాద్, మిరుదొడ్డి, కొమురవెల్లి,

మిగతా 8వ పేజీలో

# లోక్‌అదాలత్‌లో 3,787 కేసుల పరిష్కారం

సిద్దిపేట క్రైం/హుస్నాబాద్/గజ్వేల్, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): జాతీయ మెగా లోక్‌అదాలత్‌లో మొత్తం 3,787 కేసులు పరిష్కారమయ్యాయని జిల్లా ప్రధాన న్యాయాధికారి సాయిరమాదేవి తెలిపారు. శనివారం సిద్దిపేటలోని జిల్లా కోర్టు ఆవరణలో ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి మిల్లండ్ కాంబ్లీతో కలిసి లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయాధికారి సాయిరమాదేవి మాట్లాడుతూ క్షణికావేశంలో చేసిన తప్పులను, పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించుకోవడానికి ఇది సరైన వేదిక అన్నారు. ఒక్కసారి లోక్ అదాలత్‌లో కేసు రాజీపడితే మళ్లీ అప్పీలుకు వెళ్లే అవకాశం ఉండదన్నారు. ఈ విషయాన్ని పోలీసులు, న్యాయవాదులు ఇరువర్గాల వారికి అర్థమయ్యేలా తెలియజేయాలన్నారు. ఈ జాతీయ లోక్‌అదాలత్‌లో 3,733 క్రిమినల్ కేసులు, 39 సివిల్ కేసులు, 15 మోటారు యాక్సిడెంట్ కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. రోడ్డు ప్రమాద బాధితులకు ఇన్సూరెన్స్ కంపెనీల నుంచి రూ.కోటి లక్షా 75 వేల నష్ట పరిహారం ఇప్పించినట్లు తెలిపారు. హుస్నాబాద్ పట్టణంలోని మున్సిఫ్ కోర్టులో ఫస్టు క్లాస్ మేజిస్ట్రేట్ న్యాయాధికారి రేవతి, గజ్వేల్ కోర్టులో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి మూల స్వాతిగౌడ్ ఆధ్వర్యంలో జాతీయ మెగా లోక్‌అదాలత్‌ను నిర్వహించారు.



### 12 ఏళ్ల అనంతరం కలుసుకున్న అన్నాచెల్లి

గజ్వేల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : 12 ఏళ్ల అనంతరం లోక్‌అదాలత్ చొరవతో అన్నాచెల్లెళ్లు కలుసుకున్నారు. గజ్వేల్ కోర్టు న్యాయాధికారి మూల స్వాతి గౌడ్, ఇన్స్‌పెక్టర్ వి.రవికుమార్ ప్రత్యేక చొరవతో 21012, జూలై 29న డబ్బు విషయంలో నసీరుద్దీన్, అతని చెల్లెలు షహీనా గొడవపడగా, ఈ విషయంలో ఎదురెదురు కేసులు నమోదయ్యాయి. ఈ కేసును విచారించిన న్యాయాధికారి మూల స్వాతిగౌడ్, ఇన్‌స్పెక్టర్ రవికుమార్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శంకర్, కోర్టు కానిస్టేబుల్ కుమార్ సహకారంతో వారిద్దరితో మాట్లాడి రాజీ పడేలా చేశారు.



## తక్కువ మోతాదులో యూరియా వాడాలి

చేగుంట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పంటలకు యూరియాను తక్కువ మోతాదులో వాడుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి దేవ్‌కుమార్ రైతులకు సూచించారు. శనివారం మండల కేంద్రంలో యూరియా పంపిణీని పరిశీలించి రైతులతో మాట్లాడారు యూరియా అధికంగా


ఆగ్రో సేవా కేంద్రం వద్ద రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి

వాడడం వల్ల పంటలకు నత్రజని ఎక్కువ మోతాదులో చేరి, పంట దిగుబడి తక్కువగా వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. వరి, కూరగాయ పంటలకు నానో యూరియా వాడడం వల్ల రైతులకు పంట అధిక దిగుబడితో పాటు మొక్కకు మోతాదులో నత్రజని అందుతుందన్నారు. చేగుంట మండలానికి అదనంగా 400 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేశామన్నారు. యూరియా కోసం ఆందోళన చెందవద్దని పేర్కొన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి హరిప్రసాద్, ఉన్నారు.



# దళిత సంఘాల ఆందోళన

- పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని..
- మహిళ మృతికి కారణమయ్యాడని ఆరోపణ


ఎంపీపీ కార్యాలయం ముందు బైఠాయించిన నాయకులు

చేగుంట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మహిళ మృతికి కారణమైన పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబాని న్యాయం చేయాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బాధిత కుటుంబంతో కలిసి శనివారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట బైఠాయించి, ఆందోళన చేపట్టారు. మండల పరిధిలోని పొలంపల్లి గ్రామంలో శుక్రవారం చెరువులో పడి మృతి చెందిన కొండి లక్ష్మి మరణానికి పంచాయతీ కార్యదర్శి కారణమని ఆమె భర్త ఆంజనేయులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇంటిముందు కాలువ శుభ్రం చేయాలని పంచాయతీ కార్యదర్శిని కోరగా, కులం పేరుతో దూషించాడని, పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మనస్తాపానికి గురై చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుందని పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవడంతో పాటు, బాధిత కుటుంబానికి ఎకరా ప్రభుత్వ భూమిని కేటాయించాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో చిన్నారెడ్డిలు వారితో మాట్లాడి శాంతింపజేశారు.

# స్మార్ట్ వ్యవసాయం

- ఆకుల రంగును బట్టి ఎరువుల వినియోగం
- త్వరలో రైతుల చెంతకు ప్రత్యేక రంగుల పట్టిక
- అద్భుత సాంకేతికత.. పంట పర్యావరణ హితం




రామాయంపేట, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ కొత్త పుంతలు తొక్కుతోంది. రోజుకో అద్భుత సాంకేతికతను అందుబాటులోకి తెస్తుంది. రైతులను ప్రోత్సహిస్తూ "స్మార్ట్ " వ్యవసాయానికి వినూత్న అడుగులు వేస్తున్నది. పంటల స్థితిగతులు, ఏ దశలో ఉన్నాయో..! సూచించే మరో కొత్త సాధనాన్ని వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు ప్రవేశపెట్టారు. అతి తక్కువ ఖర్చుతో కూడుకున్న ఆకుల రంగు పట్టిక (ఎల్.సి.సి)ను ఇటీవలే విడుదల చేశారు. త్వరలో దీనిని మెదక్ జిల్లాలోని రైతులకు అందించనున్నారు.

### పట్టికలో మూడు రంగులు..

పట్టికలో లేత ఆకుపచ్చ, ఆకుపచ్చ, ముదురు ఆకుపచ్చ రంగులను ఇచ్చారు. ఇందులోని రంగును బట్టి నత్రజని ఎరువులు వాడాలి. లేత ఆకుపచ్చ రంగులో ఉన్న పంటకు నత్రజని ఎరువుల లభ్యత ఎక్కువ అవసరం. ఇందుకు అనుగుణంగా వాడాల్సి ఉంటుంది. ఆకుపచ్చ రంగులో పంట మారితే మోతాదుకు అనుగుణంగా ఎరువులు వేయాలి.అతిగా వాడకూడదు. ఆకుపచ్చ రంగుకు పంట మారితే చీడ పురుగులు ఆకర్షించే అవకాశాలు మెండుగా ఉంటాయి.అందువల్ల రైతులు ఎరువుల వాడకం పూర్తిగా తగ్గించి అత్యంత జాగ్రత్తలు వాడాలి.

### త్వరలోనే రంగుల పట్టికలు ఇస్తాం..



మూడు రంగుల పట్టికను రైతులకు త్వరలోనే అందజేస్తాం. ఇటీవలే వ్యవసాయ శాఖ వీటిని ప్రవేశపెట్టింది. మెదక్ జిల్లాకు ఇంకా అందుబాటులోకి రాలేదు. ఇది వచ్చిన వెంటనే రైతులకు ఇస్తూ దాన్ని వాడే పద్ధతులను తెలుపుతాం

- రాజ్ నారాయణ, రామాయంపేట వ్యవసాయ సహాయ సంచాలకులు

# డబ్బులివ్వనందుకే అంతమొందించారు

- శ్రీకాంత్‌రెడ్డి హత్య కేసులో పోలీసుల నిర్ధారణ

ఏఎస్‌రావునగర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): డబ్బులు ఇవ్వనందుకే రియల్టర్ మొగుళ్ల శ్రీకాంత్‌రెడ్డిని ధన్‌రాజ్ యాదవ్ హత్య చేసినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలినట్లు సమాచారం. కుషాయిగూడ హెచ్‌బీకాలనీలో శుక్రవారం శ్రీకాంత్‌రెడ్డి హత్య ఘటన స్థానిక సంచలనం సృష్టించింది. సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం వీరన్నపేటకు చెందిన శ్రీకాంత్‌రెడ్డి కుటుంబం చాలా ఏళ్ల క్రితం నగరానికి వలస వచ్చి మంగాపురంలో స్థిరపడ్డారు. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. తండ్రి లింగారెడ్డి రిటైర్డ్ ఉద్యోగి, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే శ్రీకాంత్‌రెడ్డి ఎక్కువగా వివాదాస్పద భూములు కొనుగోలు చేసి సెటిల్ చేసుకుంటూ ఆర్థికంగా బలపడ్డాడు. ఇతని వద్ద లాలాపేటకు చెందిన ధన్‌రాజ్ యాదవ్ కొన్నేళ్లుగా బౌన్సర్‌గా పని చేస్తున్నాడు. ధన్‌రాజ్‌కు నెలవారి జీతంతో పాటు ఇతర ల్యాండ్ సెటిల్‌మెంట్‌లో కమీషన్ ఇస్తుంటాడు. కీసర మండలం బోగారంలో శ్రీకాంత్ రెడ్డికి చెందిన రూ.కోట్లు విలువ చేసే ఓ వివాదాస్పద భూమిని ధన్‌రాజ్‌యాదవ్ తన స్నేహితుడైన లాలాపేటకు చెందిన జోసఫ్ ఎలియాస్ డానియల్, మరి కొంత మందితో కలిసి ఇటీవల సెటిల్ చేశాడు. ఒప్పందం ప్రకారం ఇందుకు సంబంధించిన కమీషన్ డబ్బులు ధన్‌రాజ్‌యాదవ్‌కు చెల్లించాల్సి ఉంది. ఇవ్వకుండా కాలం వెళ్లదీయడంతో పాటు ఇక నుంచి తన దగ్గర పనిచేయాల్సిన అవసరం లేదంటూ వెళ్లగొట్టాడు.


శ్రీకాంత్‌రెడ్డి(ఫైల్)

రెండు నెలల జీతంతో పాటు రావాల్సిన మరో సుమారు రూ.15 లక్షల ఇవ్వకపోవడంతో శ్రీకాంత్‌రెడ్డిని అంతమొందించాలని ధన్‌రాజ్ యాదవ్ నిర్ణయించుకున్నాడు. దీంతో శుక్రవారం మధ్యాహ్నం తన స్నేహితుడైన జోసఫ్ ఎలియాస్ డానియల్‌తో కలిసి మద్యం తాగి ద్విచక్ర వాహనంపై మంగాపురంలోని శ్రీకాంత్‌రెడ్డి కార్యాలయానికి చేరుకుని నిలదీశారు. మాటామాటా పెరిగి ఘర్షణకు దారితీసింది. దీతో శ్రీకాంత్‌రెడ్డిని బయటకు లాక్కొచ్చి తన వెంట తీసుకువచ్చిన కత్తితో విచక్షణా రహితంగా పొడిచి హత్య చేశారు. నిందితులను అదుపులోకి తీసుకుని తదుపరి విచారణ కొనసాగిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. గతంలో వారి నేరచరిత్రపై కూడా ఆరా తీస్తున్నట్లు తెలిపారు.



## కొండముచ్చుల దాడిలో ఇద్దరికి గాయాలు

జహీరాబాద్,సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని రాంనగర్‌లో శనివారం కొండముచ్చులు పలువురిపై దాడులు చేసి శరణమ్మ, రాజ్‌కుమార్‌లను గాయపరిచాయి. గాయాలకు గురైన వారిని స్థానికులు, బంధువులు ప్రభుత్వాస్పత్రికితరలించి చికిత్సలు చేయిస్తు న్నారు.ఈ పాటికే మానిక్‌ప్రభుమహేశా, నాగులకట్ట తదితర ప్రాంతాల్లో కూడ ఇటీవల కాలంలో పలువురిపై దాడిచేసి గాయాలకు గురిచేశాయని బాధితులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. పట్టణంలోని ఆయా ప్రాంతంలో ఇళ్లల్లో నివాసముండే వారు కొండముచ్చులు వచ్చిన సమయాల్లో ఇళ్లల్లో నుండి బయటకు రావడానికి భయపడుతున్నారు.పట్టణంలో ఓవైపు వీధికుక్కలు,మరోవైపు కొండముచ్చులు విచ్చలవిడిగ స్వైరవిహారం చేస్తు రోడ్డు గుండ వెళ్తున్న వారిపై దాడులుచేసి గాయాలకు గురిచేస్తుయని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైన అధికారులు, నాయకులు స్పందించి వాటిబారి నుండి తమను రక్షించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## మిట్టపల్లి ఆర్చ్ ఫార్మాలో అగ్నిప్రమాదం

- నలుగురు కార్మికులకు గాయాలు..


చికిత్స పొందుతున్న కార్మికులు

సిద్దిపేట అర్బన్ సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి సమీపంలోని ఆర్చ్ ఫార్మా లో జరిగిన అగ్నిప్రమాదంలో నలుగురు కార్మికులు గాయపడిన సంఘటన శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానిక కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం మధ్యాహ్నం భోజనం తర్వాత నలుగురు కార్మికులు స్టీమ్ లైన్ కంప్రెసర్ వేల్డింగ్ చేస్తుండగా వచ్చిన మెరుగులతో ప్రమాదం చోటు చేసుకున్నట్టు తెలిపారు. ఈ సమయంలో అక్కడ పనిచేస్తున్న నలుగురు కార్మికులు మఠం శ్రీనివాస్ శీలం మల్లేశం పయ్యావుల కొమరయ్య మరొక వ్యక్తి ముంద్రాయికి చెందిన కార్మికుడుకి గాయాలయ్యాయి. మొహం వీపు చేతులు చెవుల భాగాలలో స్వల్ప గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం సిద్దిపేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు ప్రస్తుతం కార్మికులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు ఎటువంటి ప్రమాదం లేదని డాక్టర్లు చెప్పినట్లు తోటి కార్మికులు తెలిపారు.

## అందుబాటులో ఉండని లైన్‌మన్

- పట్టణ ప్రజలకు తప్పని కరెంట్ కష్టాలు
- నచ్చకపోతే బదిలీ చేయమని గతంలోనే చెప్పిన లైన్‌మన్

అల్లాదుర్గం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణ విద్యుత్ ఇబ్బందులు తీర్చే లైన్‌మన్ అందుబాటులో ఉండకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. లైన్‌మన్ స్థానికంగా ఉండటం లేదని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నెల 12న పట్టణ నడిబొడ్డున ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు చెలరేగాయి, లైన్‌మన్ అందుబాటులో లేకపోవడంతో స్థానికులే మంటలను ఆర్పివేశారు. లైన్‌మన్ నిదానంగా గంటల తర్వాత అక్కడి వచ్చారు. పట్టణంలో తరచూ విద్యుత్ తీగలు తెగిపడుతున్నాయి. విద్యుత్ అంతరాయం ఏర్పడుతుండగా, ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి. అయితే, గత నెల 25న లైన్‌మన్ విషయాన్ని ట్రాన్స్‌కో అధికారులకు ఫిర్యాదు చేయగా, 30న సంబంధిత అధికారులు విచారణ జరిపారు. స్థానికుల సమక్షంలో జరిగిన ఈ విచారణలో తన పనితీరు ఇలాగే ఉంటుందని, నచ్చకపోతే బదిలీ చేయమని సదరు లైన్‌మన్ బహిరంగంగానే చెప్పడం గమనార్హం. ఇదే విషయం పత్రికలో ప్రచురితమైనా అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలకు కరెంట్ కష్టాలు తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లైన్‌మన్ అందుబాటులో ఉండే విధంగా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

## చెరువులో మునిగి యువ రైతు మృతి


మహేష్(ఫైల్)

నిజాంపేట, సెప్టెంబర్ 13(ఆంధ్రజ్యోతి): పశువులకు నీళ్ల తాపేందుకు వెళ్లిన యువ రైతు ప్రమాదవశాత్తు చెరువులో మునిగి ప్రాణాలొదిలాడు. వివరాల్లోకి వెళితే.. నిజాంపేట మండల పరిధి నార్లాపూర్ గ్రామానికి చెందిన గొల్ల మహేష్(24) శుక్రవారం మధ్యాహ్నం పశువులను తోలుకొని మేతకు వెళ్లి రాత్రయినా తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెతికే క్రమంలో శనివారం ఉదయం హైదర్ చెరువు వద్ద అతడికి సంబంధించిన ఆనవాళ్లు కనిపించాయి. దీంతో పోలీసులకు సమాచారం అందించగా వారు రెస్క్యూ బృందంతో ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాన్ని వెలికి తీయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజేష్ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి ..


భూమయ్య మృతదేహం

కల్హేర్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన ఘటన మండల పరిధిలోని క్రిష్ణాపూర్ గ్రామ సమీపంలో నల్లవాగు కుడి కాలువ వద్ద శనివారం సాయంత్రం చోటుచేసుకున్నది. కల్హేర్ ఎస్‌ఐ మధుసూధన్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మార్డి గ్రామానికి చెందిన చింతల భూమయ్య(35) మార్డి గ్రామం నుంచి క్రిష్ణాపూర్ వైపు టీవీఎస్ ఎక్సల్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని ఆటో రిక్షా అతడి ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. సీసీ ఫుటేజీని పరిశీలించి ప్రమాదానికి కారణమైన ఆటో రిక్షాను, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుంటామని ఎస్‌ఐ తెలిపారు. మృతుడు భూమయ్యకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. భార్య పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. భూమయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నారాయణఖేడ్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

## బ్యాంక్ ఎదుట నిలిపిన బైక్ చోరీ



చోరికి గురైన బైక్

నారాయణఖేడ్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ పరిధిలోని మండల కేంద్రమైన నిజాంపేటలో బ్యాంకు ముందు నిలిపిన బైక్ చోరీకి గురైంది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. సిర్గాపూర్ మండలం కడ్పల్ పంచాయతీ కార్యదర్శి అరుణ్‌కుమార్ శనివారం తన స్వగ్రామమైన రాపర్తి నుంచి నిజాంపేటకు పనిపై వచ్చాడు. బైకును బ్యాంకు ముందు నిలిపి తన పనులు ముగించుకొని తిరిగి వచ్చి చూసేవరకు బైక్ కనిపించలేదు. దీంతో తన బైక్(టీఎస్15ఈవై1084) ఎవరికైనా కనిపిస్తే 9440634764 నంబరుకు సమాచారం ఇవ్వాలని బాధితుడు కోరారు.

## వైన్స్ ఎదుట పార్క్ చేసిన బైక్..

రామాయంపేట,సెప్టెంబర్ 13(ఆంధ్రజ్యోతి): రామాయంపేట పట్టణంలో ద్విచక్ర వాహన దొంగతనాలు ఆగడంలేదు. బుధవారం, గురువారం వరుసగా తాళాలు వేసిన రెండిళ్లలో దొంగలు పడ్డారు. అలాగే ఓ బైక్‌ను ఎత్తుకెళ్లారు. శుక్రవారం రాత్రి కూడా మెదక్ రూట్‌లోని ఓ వైన్స్ ఎదుట పార్క్ చేసిన టీవీఎస్ ఎక్సెల్ మోపెడ్‌ను అపహరించారు.

## గుర్తుపడితే సమాచారమివ్వండి


బైకును ఎత్తుకెళ్తున్న సీసీ కెమెరా దృశ్యం

నిజాంపేట, సెప్టెంబర్ 13(ఆంధ్రజ్యోతి): బైక్ దొంగ సీసీ ఫుటేజీ ఫొటోను పోలీసులు విడుదల చేశారు. ఫొటోలో ఉన్న నిందితుడిని గుర్తిస్తే సమాచారం ఇవ్వాలని నిజాంపేట ఎస్సై రాజేష్ తెలిపారు. మండల పరిధిలోని చల్మెడకు చెందిన కంపే నాగరాజు తన ద్విచక్రవాహనం (టీఎస్16ఈఈ2861)ను గొర్లపాక వద్ద పార్క్ చేశాడు. గుర్తు తెలియని వ్యక్తి వాహనాన్ని చోరీ చేసి తీసుకెళ్లారు. ఆ దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. ఈ ఫొటోను విడుదల చేశారు.

# మాస్టార్లు



ఘనపూర్ పాఠశాలలో విద్యాబోధన చేస్తున్న శేఖర్

చదువు చెప్పడమే విశ్రాంతి..

రిటైర్‌మెంట్ తర్వాతా విద్యాబోధన

ఆదర్శంగా నిలుస్తున్న ఉపాధ్యాయుడు

**తల్లిదండ్రుల తర్వాత పిల్లలకు గురువే దైవం అంటారు. ఉపాధ్యాయుడంటే చదువు చెప్పడం ఒక్కటే కాదు.. పిల్లల భవిష్యత్‌ను తీర్చిదిద్దే విధాత. విద్యార్థులు ఉన్నత స్థానానికి చేరితే వచ్చే పేరులో టీచర్ పాత్ర కూడా ఉంటుంది. అలాంటి అద్వితీయ పాత్రను పోషిస్తున్నారు సిద్దిపేట జిల్లాలోని కొందరు టీచర్లు. ఒకరు ఉద్యోగ విరమణ తర్వాత కూడా స్కూల్‌కు వస్తూ విద్యార్థులకు పాఠాలు చెబుతున్నారు. మరొకరు ఏకంగా విద్యార్థులను దత్తత తీసుకుని చదివిస్తున్నారు.**

తొగుట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): చేసింది ప్రభుత్వ ఉద్యోగం. విరమణ తర్వాత అందరూ హాయిగా ఇంటిపట్టునే ఉండి విశ్రాంతి తీసుకోవాలనుకుంటారు. లేకపోతే ఇతరాత్ర ఆదాయ మార్గాలను వెతుక్కుంటారు. ఆయన అందరిలాంటి వారు కాదు. ఉద్యోగ జీవితంలో రోజూ విద్యార్థులకు పాఠాలు చెప్పిన ఆయన ఉద్యోగ విరమణ తర్వాత విద్యార్థులను వదిలి ఇంట్లో ఉండలేకపోయారు. తాను ఎక్కడైతే ఉద్యోగ విరమణ చేశారో అదే పాఠశాలకు వెళ్లి పాఠాలు చెబుతున్నారు. ఆయన సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం రాజగోపాల్‌పేటకు చెందిన కొంక శేఖర్ సార్.. ఆయన ఈ ఏడాది మార్చి 31న ఉద్యోగ విరమణ చేసిన తొగుట మండలం ఘనపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇంకా చదువులు చెబుతూ మంచి మార్కులు సంపాదిస్తున్నారు.

## అన్ని క్లాసులు ఆయనవే..

నంగునూర్ మండలం రాజగోపాల్‌పేటకు చెందిన కొంక శేఖర్ 2018 జులైలో ఘనపూర్ పాఠశాలకు ఇంగ్లిష్ టీచర్‌గా బదిలీపై వచ్చారు. అప్పటి నుంచి అన్ని తరగతులకు ఇంగ్లిష్ బోధించిన ఆయనకు విద్యార్థులతో అనుబంధం ఏర్పడింది. వాళ్లకు చదువు చెప్పకపోతే ఆ రోజంతా ఏదో వెలితిగా ఉంటుందంటారు ఆయన. మార్చి 31న ఆయన ఉద్యోగ విరమణ చేయగా, సబ్జెక్ట్ టీచర్ వచ్చేవరకు విద్యార్థులు నష్టపోవద్దనే ఉద్దేశంతో మరుసటి రోజు నుంచి ఆయన తరగతులకు హాజరు కావడం ప్రారంభించారు. తన ఉద్యోగ జీవితంలో చెప్పినట్లు రోజూ పిల్లలకు పాఠాలు చెబుతున్నారు. ఇటీవల జరిగిన ఉపాధ్యాయ బదిలీల్లో ఈ పాఠశాలకు ఇంగ్లిష్ టీచర్‌ను కేటాయించారు. అయితే, శేఖర్ సార్‌కు అన్ని సబ్జెక్టులపై పట్టు ఉండటంతో రోజూ స్కూల్‌కు వచ్చి విద్యార్థులకు తరగతిని బట్టి ఏదో ఒక సబ్జెక్ట్ బోధిస్తున్నారు. ఇంకో విశేషం ఏమిటంటే ఆ పాఠశాల హెడ్ మాస్టర్ అంజలి ఆయన సతీమణే. పాఠశాలలో మొత్తం 105 మంది విద్యార్థులుండగా, ఎమిమిది మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు.

### మాసర్ట్ సేవలు అభినందనీయం



మా గ్రామ పాఠశాలలో ఉద్యోగ విరమణ చేసిన శేఖర్ మాస్టర్ ఉద్యోగ విరమణ చేసిన తర్వాత కూడా స్కూల్‌కు వచ్చి పాఠాలు చెప్పడం అభినందనీయం. శేఖర్ సార్ విలువలతో కూడిన విద్యను బోధిస్తారు.


- కొమ్ము శరత్, తాజా మాజీ ఎంపీటీసీ సభ్యుడు

### విద్యార్థుల మధ్య ఉండటం అలవాటైంది



చిన్నప్పుడు అమ్మానాన్న బడిలో చేర్పించిన నాటి నుంచి విద్యార్థుల మధ్య గడపడం అలవాటైంది. తర్వాత టీచర్ ఉద్యోగం రావడంతో జీవితమంతా విద్యార్థులతోనే గడిచిపోయింది. భార్యభర్తలం ఉపాధ్యాయులమే. అందుకే విశ్రాంతి తీసుకోకుండా పిల్లలకు పాఠాలు చెబుతున్నా. మా ముగ్గురు పిల్లలు ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజనీరు, ఒకరు డాక్టర్. వాళ్లు పెద్దవాళ్లయ్యారు. స్కూల్లో పిల్లలకు పాఠాలు చెప్పడమే నా కాలక్షేపం.

- కొంక శేఖర్, రిటైర్డ్ ఉపాధ్యాయుడు



బోధన చేస్తున్న అందె విజయ్‌కుమార్

# అన్నింటా.. అందెవేసిన చేయి

● ఉపాధ్యాయుడిగా.. సామాజిక సేవకుడిగా.. ● పేద విద్యార్థుల దత్తత



ఉత్తమ టీచర్ అవార్డు అందుకుంటున్న విజయ్‌కుమార్

చేర్యాల, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పాఠాలు చెబితే చాలు పనైపోతుందనుకునే ఉపాధ్యాయులు ఉన్న ఈ రోజుల్లో విద్యార్థులను దత్తత తీసుకుని వారికి చదువు చెప్పిస్తున్నారు. సామాజిక సేవ చేస్తూ ఈ సార్.. మాస్టార్ అనిపించుకుంటున్నారు చేర్యాల పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు అందె విజయ్‌కుమార్. టీచర్‌గానే కాకుండా క్రీడాకారుడిగా, సామాజిక సేవకుడిగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డును కైవసం చేసుకున్నారు.

సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం రేబర్తి గ్రామానికి చెందిన అందె రాచమల్లయ్య-సారాగ్రేస్ ఉపాధ్యాయ దంపతుల కుమారుడైన అందె విజయ్‌కుమార్‌కు ఓ టీవీ చానల్‌లో ఉద్యోగం వచ్చినా బోధనావృత్తిపై మక్కువతో విరమించుకున్నాడు. 2000 డీఎస్సీలో టీచర్ ఉద్యోగం పొందిన ఆయన పలు ప్రాంతాల్లో పని చేశారు. 2024లో నాగపురి జడ్పీఎస్ఎస్‌కు బదిలీపై వచ్చారు. తన ఉద్యోగ ప్రస్థానంలో బచ్చన్నపేట మండలం సాల్వాపూర్‌కు చెందిన విద్యార్థి కల్పనను, దాచారం స్కూల్‌లో పని చేసిన సమయంలో తల్లితండ్రులుకోల్పోయిన విద్యార్థి శృతితో పాటు చేర్యాల మండలం పోతిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన విద్యార్థి ఐశ్వర్యను దత్తత తీసుకుని చదివిస్తున్నారు.

## క్రీడాకారుడిగా..

అందె విజయ్‌కుమార్ ఉపాధ్యాయుడిగానే కాకుండా మంచి క్రికెటర్ కూడా. చేర్యాలలో జాగృతి క్రికెట్ క్లబ్‌ను ఏర్పాటుచేశారు. జిల్లాస్థాయిలో అనేక టోర్నమెంట్లు ఆడారు. 1992లో చేర్యాల జూనియర్ కళాశాల, 1995లో డిగ్రీకళాశాల ఛాంపియన్‌గా నిలిచారు. నేటికీ సమయం దొరికినప్పుడల్లా క్రీడామెళకువలు నేర్పుతూ క్రీడాస్ఫూర్తి చాటుకుంటున్నాడు.

## ఎన్నో అవార్డులు..

అందె విజయ్‌కుమార్ ఉద్యోగ ప్రస్థానంలో ఎన్నో జిల్లా, రాష్ట్రస్థాయి అవార్డులు కైవసం చేసుకున్నాడు. అబ్దుల్ కలాం మెమోరియల్, సేవాభూషణ్, మదర్ థెరిసా సేవా సంస్థ అవార్డులతో పాటు రాజకీయ నాయకుల సత్కారాలు పొందారు.

## సామాజిక సేవ

ఉపాధ్యాయుడిగా రాణిస్తూనే మానవసేవయే మాధవ సేవగా పరిగణిస్తూ వలస కూలీలకు, అనాథలు, కార్మికులకు నిత్యావసర సరుకులు, దుస్తులు, ఆహారం అందించి ఆకలి బాధలు తీరుస్తున్నారు. గివింగ్ హ్యాండ్స్ సంస్థను ఏర్పాటు చేసి, తన జన్మదినం సందర్భంగా ఏటా సామాజిక సేవ కార్యక్రమాలు చేపడుతున్నారు. ఆయన సతీమణి క్రిసోలైటస్ కూడా ఉపాధ్యాయురాలే.




హోటల్‌లో పనిచేసే కార్మికులకు దుస్తులు అందిస్తున్న అందె విజయ్‌కుమార్



భరత్‌రెడ్డికి గోల్డ్ మెడల్ అందజేసి అభినందిస్తున్న రాష్ట్ర ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు

# సంగారెడ్డి సెంట్రల్ జైలు డిప్యూటీ సూపరింటెండెంట్‌కు గోల్డ్ మెడల్

● ఆలిండియా జైళ్లశాఖ డ్యూటీమీట్‌లో ప్రతిభ

కంది, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ తెలంగాణ పోలీస్ అకాడమీలో ఈ నెల 9 నుంచి 12 వరకు జరిగిన 7వ ఆలిండియా జైళ్లశాఖ డ్యూటీమీట్‌లో కందిలోని సంగారెడ్డి సెంట్రల్ జైలు డిప్యూటీ సూపరింటెండెంట్ దండా భరత్‌రెడ్డికి గోల్డ్‌మెడల్ వచ్చింది. జాతీయ స్థాయి పోటీల్లో మొత్తం 21 రాష్ట్రాలు పాల్గొన్నాయి. కంప్యూటర్ అండ్ టెక్నాలజీ ఉపయోగించడంలో జరిగిన "ప్రిజన్స్ బిజినెస్ మోడల్" పోటీలో భరత్‌రెడ్డి అద్భుత ప్రతిభ కనబర్చి గోల్డ్‌మెడల్ సాధించారు. 2022లో గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో జరిగిన 6వ డ్యూటీమీట్‌లో కూడా భరత్‌రెడ్డికి బంగారు పతకం లభించింది. శనివారం తెలంగాణ పోలీస్ అకాడమీలో భరత్‌రెడ్డికి రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆయనకు గోల్డ్ మెడల్ అందజేసి అభినందించారు.

# వికసిత్ భారతే ప్రధాని మోదీ లక్ష్యం

● మెదక్ ఎంపీ రఘునందన్ రావు




సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్ రావు

సిద్దిపేట క్రైం, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): వికసిత భారత దేశమే లక్ష్యంగా ప్రధాని మోదీ తన పాలన సాగిస్తున్నారని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. శనివారం రాత్రి సిద్దిపేట జిల్లా కేంద్రంలోని రైస్ మిల్ అసోసియేషన్‌లో వర్తక వాణిజ్య వ్యాపారస్తులతో నిర్వహించిన జీఎస్టీ తగ్గింపుపై అవగాహన సదస్సులో ఎంపీ పాల్గొని మాట్లాడారు. దేశం విశ్వగురువుగా చేయాలన్నదే మోదీ లక్ష్యం అన్నారు. దేశానికి కష్టం వచ్చినపుడు ముందుండి నడిపించే అసలైన నాయకుడు మోదీ అని కొనియాడారు. పరిపాలన సరిగా లేక నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంక దేశ ప్రధానులను ఆ దేశ పౌరులు దేశం విడిచి పారిపోయేలా చేశారని గుర్తు చేశారు. ఓట్ల చోరీ అయిందని రాహుల్ గాంధీ సిగ్గులేకుండా మాట్లాడుతున్నాడని విమర్శించారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎంపీల ఓట్లు చెల్లకుండా పోవడం సిగ్గుచేటన్నారు. ఓటు చోరీ నోట్ చోరీ చేసింది కాంగ్రెస్ పార్టీ నాయకులే అని ఆరోపించారు. పదేండ్ల కాంగ్రెస్ పాలనలో జీఎస్టీ బిల్లు పాస్ చేయలేకపోయారని ఎద్దేవ చేశారు. పేద ప్రజలకు లబ్ధి చేకూరేలా కొత్త జీఎస్టీని తేవడంతో పేద మధ్యతరగతి ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. దేశంలో ఒక కోటి 51 లక్షల మంది జీఎస్టీ కడుతున్నారని వివరించారు. 173 దేశాలలో ఏ ప్రధాని కూడా చేయని విధంగా 11 ఏండ్ల నుంచి ఈ దేశానికి మోదీ ప్రధానిగా పనిచేయడం గర్వకారణమన్నారు. 2001 నుంచి 2025 వరకు ఓటమి ఎరుగని నాయకుడు మోదీ అన్నారు. ఇంట్లో డబ్బులు పంచుకునేందుకు కేసీఆర్ కుటుంబంలో గొడవలు అయితున్నాయని ఆరోపించారు. హెల్త్ ఇన్సూరెన్స్‌లో జీరో శాతం జీఎస్టీ తేవడం గొప్ప విషయం అన్నారు.

# మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన

భారీగా తరలివచ్చిన యువత

ఉద్యోగాలను ఆఫర్ చేసిన పలు కంపెనీలు

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా జాబ్‌మేళాకు నిరుద్యోగ యువత నుంచి విశేష స్పందన వచ్చింది. శనివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని విపంచి ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన మెగా జాబ్‌మేళాకు దాదాపు 2 వేల మందికి పైగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. విపంచి మెయిన్ ఆడిటోరియం సరిపోకపోవటంతో సెల్లార్‌లో కూడా ఏర్పాట్లు చేశారు. దాదాపు 35 కంపెనీలు పాల్గొన్నాయి. చాలా కంపెనీలు వెంటనే ఉద్యోగాలు ఇచ్చాయి. ఐటీ కంపెనీలు మరోమారు పరీక్ష నిర్వహించనున్నాయి. అంతకుముందు ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీమంత్రి హరీశ్‌రావు యువతనుద్దేశించి మాట్లాడారు. చాలా మంది మంచి ఉద్యోగం వస్తేనే చేస్తామని అనుకుంటారు కానీ జీవితంలో మొదటి అడుగు పడడం అనేది చాలా ముఖ్యమని సూచించారు. ఊరు దాటి ఉద్యోగం చేస్తేనే అనుభవం వస్తుందని, ప్రపంచం అర్థమవుతుందన్నారు. సిద్దిపేటలో మరిన్ని జాబ్‌మేళాలు ఏర్పాటు చేస్తానని చెప్పారు.



జాబ్‌మేళాకు వచ్చిన యువతతో మాట్లాడుతున్న హరీశ్ రావు

### మొదటి ప్రయత్నంలోనే సెలక్ట్ అయ్యా..

-బాసంగారి మమత, భరత్‌నగర్, సిద్దిపేట



డిగ్రీ మైక్రోబయాలజీ చేశాను. ప్రైమరీ హెల్త్ కేర్ సంస్థలో నర్సింగ్ జాబ్ వచ్చింది. సంవత్సరానికి రెండున్నర లక్షలు పాక్యేజీ ఇచ్చారు. చదువు పూర్తయ్యాక కంపెనీల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా జాబ్ మేళా వల్ల మంచి అవకాశాలు మా దగ్గరకే వచ్చాయి.

### ఫ్రెషర్స్‌కు మంచి అవకాశం

- గాజుపాక పల్లవి, హౌసింగ్ బోర్డు సిద్దిపేట



బీఫార్మసీ పూర్తి చేశాను. ఫార్మసిస్ట్‌గా ఉద్యోగం వచ్చింది. ఇలాంటి మేళాలు భవిష్యత్ మరిన్ని జరగాలి. ఫ్రెషర్స్‌కు ఇలాంటివి మంచి అవకాశం. చదువు పూర్తి కాగానే ఏదో ఒక జాబ్‌లో చేరే అవకాశం వచ్చింది. నిర్వాహకులకు కృతజ్ఞతలు.

### జాబ్ రావటం ముఖ్యం

- తుమ్మల చరణ్, శ్రీనగర్ కాలనీ సిద్దిపేట



సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కాలేజ్‌లో బీఎస్సీ పూర్తి చేశాను. మెగా జాబ్‌మేళాకు చాలామంది హాజరయ్యారు. ఇంతమందిలో జాబ్ వస్తుందా అనుకున్నాను. రెండు మూడు కంపెనీల ఇంటర్వ్యూలకు అటెండ్ అయ్యే అవకాశం ఇచ్చారు. ముందు చిన్నదా పెద్దదా అని కాకుండా ముందు ఉద్యోగంలో చేరాక మంచి జాబ్ చూసుకోవాలని హరీశ్‌రావు చెప్పిన మాటలు ఇన్‌స్పైర్ చేశాయి. బ్యాంకింగ్ సెక్టార్‌లో లోన్స్ డిపార్ట్‌మెంట్ జాబ్ కన్ఫర్మ్ అయింది. హ్యాపీగా ఉంది.

### జాబ్ ఆప్షన్స్ ఎక్కువగా ఉంటాయి

- బి. రాధకృష్ణన్, భరత్ నగర్ సిద్దిపేట



నిరుద్యోగ యువతకు ఇలాంటి మేళాలు చాలా హెల్ప్ అవుతాయి. చదువు పూర్తయ్యాక కంపెనీల చుట్టూ తిరిగే పనిలేకుండా ఉద్యోగ అవకశాలు మన దగ్గరకే రావడం హ్యాపీగా ఉంది. మేళా వల్ల వివిధ కంపెనీలు పలు రకాల జాబ్స్ ఆఫర్ చేస్తాయి. మనకు నచ్చిన ఉద్యోగం చేసే అవకాశం దొరుకుతుంది. నేను ఇంటర్మీడియట్ పూర్తి చేశాను. నర్సింగ్ జాబ్ అవకాశం వచ్చింది.



కౌంటర్లు ఏర్పాటు చేసి ఇంటర్వ్యూలు తీసుకుంటున్న కంపెనీల ప్రతినిధులు

# యూరియా కోసం రైతుల రాస్తారోకో

పీఏసీఎస్‌లు, అగ్రోస్ కేంద్రాల వద్ద పెద్ద ఎత్తున బారులు





మిరుదొడ్డి : లింగుపల్లిలో మల్లుపల్లి గ్రామ రైతుల ధర్నా, నచ్చజెప్పుతున్న పోలీసులు

మిరుదొడ్డి, సెప్టెంబరు13 (ఆంధ్రజ్యోతి) : తమ గ్రామ రైతులకు యూరియాను ఇవ్వమని చెప్పడంతో మిరుదొడ్డి మండలం లింగుపల్లి గ్రామంలోని గజ్వేల్ దుబ్బాక రహదారిపై శనివారం రైతులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ మండలంలోని మల్లుపల్లి గ్రామ రైతులు క్లస్టర్ పరిధిలోని రుద్రారం గ్రామానికి యూరియా వచ్చిందని తెలువడంతో తమ గ్రామ రైతులతో కలిసి వెళ్లామని తెలిపారు. రుద్రారం గ్రామానికి చెందిన రైతులు మీకు యూరియాను ఇవ్వనివ్వబోమని తేల్చిచెప్పారు. దీంతో చేసేదేమిలేక మల్లుపల్లి గ్రామ రైతులు లింగుపల్లి వద్ద రాస్తారోకోను నిర్వహించారు. ఈ విషయం తెలుసుకున్న దుబ్బాక సీఐ శ్రీనివాస్, మిరుదొడ్డి ఎస్ఐ సమతా సంఘటన స్థలానికి చేరుకుని రైతులను సముదాయించారు. తమ గ్రామానికి కూడా యూరియా లారీ వస్తేనే రాస్తారోకోను విరమిస్తామని చెప్పారు. దీంతో వ్యవసాయాధికారులతో మాట్లాడి మల్లుపల్లి గ్రామానికి యూరియాను అందిస్తామని చెప్పడంతో రాస్తారోకోను విరమించారు.

## తెల్లవారుజామునుంచే..

చేగుంట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులకు తిప్పలు తప్పడం లేదు శనివారం యూరియా కోసం రైతులు తెల్లవారుజాము నుంచే రైతు వేదికల వద్ద భారీ సంఖ్యలో పడిగా గాపులు కాశారు. రైతు వేదిక వద్ద యూరియా కోసం భారీ సంఖ్యలో రైతులు క్యూ లైన్‌లో నిలుచున్నారు. వ్యవసాయ అధికారులు టోకెన్లు ఇవ్వడం మొదలైన వెంటనే ఒకేసారి రైతులందరూ రైతు వేదిక వద్దకు చేరుకోవడంతో తోపులాటలు జరిగాయి. దీంతో చేగుంట ఎస్సై చైతన్య కుమార్ రెడ్డి రైతులను సముదాయించారు. స్త్రీలు, పురుషులను వేర్వేరు వరుస క్రమంలో పంపించారు. చేగుంట మండలానికి నాలుగు షాపులతోపాటు సొసైటీకి కలిపి 1560 యూరియా సంచులు రావడంతో వ్యవసాయ అధికారులు ప్రతి రైతుకూ ఒకటి చొప్పున పంపిణీ చేశారు.



చేగుంట రైతు వేదిక వద్ద యూరియా కోసం గుమిగూడిన రైతులు



చేగుంట ఆగ్రోసేవ కేంద్రం వద్ద క్యూ లైన్‌లో రైతులు

## సంక్షేమ హాస్టళ్లు పట్టని కాంగ్రెస్ సర్కారు

● దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి



దుబ్బాకలో సంక్షేమ హాస్టళ్లపై సమీక్ష జరుపుతున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, సెప్టెంబరు13 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో సంక్షేమ హాస్టళ్లు పూర్తిగా అస్తవ్యస్తంగా మారాయని, ఈప్రభుత్వానికి విద్యార్థుల పట్ల చిత్తశుద్ధిలేదని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మండిపడ్డారు. దుబ్బాకలోని హాస్టళ్లపై ఎన్నిసార్లు విన్నవించినా ప్రభుత్వానికి పట్టింపు లేదన్నారు. శనివారం దుబ్బాకలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి సంక్షేమ హాస్టళ్లపై ఆయన సమావేశం నిర్వహించారు. అలాగే నియోజకవర్గ పరిధిలోని 92 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి పంపిణీ చేశారు. అనంతరం నియోజక వర్గంలోని ఎస్సీ బీసీ హాస్టళ్ల అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో విద్యార్థులు చనిపోతే కూడా ప్రభుత్వానికి చలనం లేదన్నారు. హాస్టళ్లో ఉన్న సమస్యలను హాస్టల్ వార్డెన్లు తన దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. వసతిగృహాల్లో సమయానికి రావలసిన బిల్లులు రాకపోవడంతో నిర్వహణకు వార్డెన్‌లే తమ జేబునుంచి డబ్బులు పెట్టుకోవాల్సి వస్తుందని తెలిపారన్నారు. అప్పుచేసి పెట్టిన డబ్బులు ప్రభుత్వం నుంచి మూడు నెలలుగా రాకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని వారు తెలిపారు. ప్రస్తుతం ఉన్న హాస్టళ్లను సక్రమంగా నిర్వహించలేని ప్రభుత్వం, కొత్త హాస్టళ్లను ఏర్పాటు చేస్తామని చెప్పడం విడ్డూరమన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సాంఘిక సంక్షేమశాఖ అధికారులు, నాయకులున్నారు.

## వంటేరుకు మల్కాజిగిరి ఎంపీ పరామర్శ



వజ్రమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న ఎంపీ ఈటెల రాజేందర్.

జగదేవ్‌పూర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నేత, ఎఫ్‌డీసీ మాజీ చెర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డిని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటెల రాజేందర్ శనివారం పరామర్శించారు. ప్రతాప్‌రెడ్డి తల్లి వజ్రమ్మ ఇటీవల జగదేవ్‌పూర్ మండలంలో దౌలాపూర్‌లో మృతి చెందింది.

## సాయుధ పోరాటాన్ని వక్రీకరిస్తే..

● సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్

అక్కన్నపేట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నిజాం సర్కార్‌కు వ్యతిరేకంగా చేసిన పోరాటమే సాయుధ పోరాటమని దీనిని వక్రీకరిస్తే బీజేపీ నేతలకు తగిన గుణపాఠం తప్పదని సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ హెచ్చరించారు. శనివారం అక్కన్నపేట మండలం గౌరవెల్లిలో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జెండాను ఆవిష్కరించి, తెలంగాణ సాయుధ పోరాట యోధులు వేముల నరసింహులు, చీకట్ల ముత్తయ్య విగ్రహాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులేనని, హుస్నాబాద్ ప్రాంత అభివృద్ధి కోసం నిరంతరం పోరాటం చేసింది ఎర్ర జెండానే అన్నారు. సాయుధ పోరాట చరిత్రను వక్రీకరించి అబద్ధాలతో రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తూ మత విద్వేషాలు సృష్టించేందుకు బీజేపీ నాయకులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. గౌరవెల్లి రిజర్వాయర్ ప్రాజెక్టు కోసం సీపీఐ పార్టీ అనేక పోరాటాలు చేసిందని గుర్తు చేశారు.

## సేవా పఖ్వాడా కార్యక్రమాలను విజయవంతం చేద్దాం

● మోదీ జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమాలు

హుస్నాబాద్ టౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 17న ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా నిర్వహించే సేవా పఖ్వాడా కార్యక్రమాలను విజయవంతం చేయాలని బీజేపీ హుస్నాబాద్ పట్టణ అధ్యక్షులు బత్తుల శంకర్‌బాబు పిలుపునిచ్చారు. శనివారం ఆయన హుస్నాబాద్ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో జరిగి సేవాపక్ష కార్యశాల సమావేశంలో మాట్లాడారు. 17వ తేదీన రక్తదాన శిబిరం, 18న స్వచ్ఛభారత్, 19వ తేదీన విద్యార్థులకు చిత్రలేఖన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రధాని మోది 75వ జన్మదినం సందర్భంగా 75 యూనిట్ల రక్తం సేకరించే విధంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నామన్నారు.

## గుగ్గిళ్లలో ఉచిత వైద్య శిబిరం

బెజ్జంకి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుగ్గిళ్ల గ్రామంలో అపర్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్ సన్ రైజ్ హస్పిటల్ వారి సాకారంతో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులకు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, వైద్యులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ టీచర్లకూ ఉత్తమ పురస్కారాలు

● మాజీమంత్రి హరీశ్‌రావు
● ట్రస్మా ఆధ్వర్యంలో గురుపూజోత్సవం

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు జ్ఞానసముపార్జనతో పాటుగా సామాజిక బాధ్యతలు, నైతిక విలువలను నేర్పించాలని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఉపాధ్యాయులకు సూచించారు. సిద్దిపేట జిల్లా కేంద్రాలలో తెలంగాణ రికగ్నైజ్‌డ్ స్కూల్ మేనేజ్‌మెంట్ (ట్రస్మా) ఆధ్వర్యంలో శనివారం జరిగిన గురుపూజోత్సవంలో పాల్గొన్నారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్, ట్రస్మా బాధ్యులతో కలిసి హరీశ్‌రావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులనుద్దేశించి హరీశ్ రావు మాట్లాడుతూ.. విద్య వల్ల ఉద్యోగాలు సంపాదించటం మాత్రమే కాకుండా మంచి సమాజాన్ని నిర్మించాల్సిన అవసరముందన్నారు. విద్యార్థులను మంచి పౌరులుగా సామాజిక బాధ్యత కలిగిన వారిగా తయారుచేసే బాధ్యత ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉంటుందన్నారు. నేపాల్, బంగ్లాదేశ్‌లో వచ్చిన విప్లవాలు మన దేశంలో రావద్దు అంటే సామాజిక నైతిక బాధ్యతలు నేర్పాల్సిన అవసరముందన్నారు.

### తప్పుదోవ పడుతున్న విద్యార్థులు

యువత డ్రగ్స్, గంజాయికి బానిసలుగా మారుతున్నారని, ఆన్‌లైన్ గేమ్స్ మాయలో పడుతున్నారని అవేదన వ్యక్తం చేశారు. మార్కులు రాలేదని ఆత్మహత్యలు చేసుకుంటున్నారని గుర్తు చేశారు. విద్యార్థులను శారీరకంగా, మానసికంగా ధృడంగా తయారు చేయాలని అందుకు క్రీడలు ఉపయోగపడతాయన్నారు. ఎప్పుడు ర్యాంకుల కోసం కాకుండా ఆరోగ్యంగా ఉండేందుకు క్రీడలను ప్రొత్సహించాలని సూచించారు.

ప్రభుత్వం తరుపున గవర్నమెంట్ టీచర్స్‌కు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ఇస్తారు. అదే మాదిరిగా ప్రైవేట్ టీచర్లకు కూడా పురస్కారాలను అందించే సంప్రదాయాన్ని మన సిద్దిపేటలోనే ప్రారంభించుకున్నామన్నారు. ప్రతి సంవత్సరంలాగానే ప్రైవేట్ టీచర్స్‌కు ఈ సంవత్సరం ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, తానూ కలిసి ఇన్స్‌రెన్స్ అందిస్తామని హమీ ఇచ్చారు. సిద్దిపేటను ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చుకున్నామని, బీఆర్ఎస్ ప్రభుత్వంలో సిద్దిపేటకు తెచ్చిన బీడీఎస్ కాలేజీని రేవంత్ రెడ్డి కొడంగల్‌కి తరలించారని విమర్శించారు. మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక తిరిగి తెస్తానన్నారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ తను రాజకీయాల్లోకి రాకముందు ఉపాధ్యాయుడు కావాలనుకున్నాడని గుర్తు చేశారు. దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ పిల్లలకు ప్రేమతో బోధిస్తే గొప్ప టీచర్‌గా గుర్తింపు వస్తుందన్నారు. సర్వేపల్లి రాధకృష్ణన్ జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా చేసినట్లుగా, సావిత్రిబాయి పూలే జయంతిని ఉపాధ్యాయిని దినోత్సవంగా ప్రభుత్వం నిర్వహించాలని సూచించారు. అనంతరం వివిధ ప్రైవేట్ పాఠశాలలకు సంబంధించిన ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారం అందజేశారు. కార్యక్రమంలో ట్రస్మా బాధ్యులు, వివిధ పాఠశాలల అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న హరీశ్‌రావు





ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకుంటున్న టీచర్లు

సిద్దిపేట నియోజకవర్గంలోని 18 గ్రామాలకు దాతల సహకారంతో ఫ్రిజర్స్ (శవపేటిక)లను సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హరీశ్‌రావు అందజేశారు.

సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఎన్‌జీవోస్ భవన్‌లో టీఎన్‌జీవోస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉత్తమ ఉపాధ్యాయులకు, ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సన్మానం కార్యక్రమంలో మాజీమంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## లక్షలు వెచ్చించి..లక్షణంగా వదిలేశారు

● మందుబాబులకు అండగా మారిన అల్వాల కూరగాయాల మార్కెట్

మిరుదొడ్డి, సెప్టెంబరు13 (సెప్టెంబరు): రైతులు పండించిన కూరగాయాలను గ్రామంలో రైతు మార్కెట్‌లో విక్రయించాలనే ఉద్దేశంతో లక్షలు వెచ్చించి కూరగాయాల షెడ్‌లను నిర్మించారు. ఆ షెడ్‌లు నిరుపయోగంగా మారి మందుబాబులకు అడ్డాగా మారుతున్నాయి. మిరుదొడ్డి మండలం అల్వాల గ్రామంలో కూరగాయాల రైతుల సౌలభ్యం కోసం కూరగాయాల షెడ్‌ను ఎన్ఆర్ఐఈజీఎస్ ద్వారా 8లక్షల రూపాయాల నిధులతో నిర్మించారు. గ్రామంలోని రోడ్డుపై కూరగాయాలను విక్రయించడం ద్వారా వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నాలుగు సంవత్సరాల క్రితం గ్రామంలోని రోడ్డు పక్కన కూరగాయాల షెడ్‌లను ఏర్పాటు చేశారు. అయినా కూడా రైతులు అక్కడ కూరగాయాలను విక్రయించడం లేదు. దీనివల్ల గ్రామంలో మద్యం బాబులకు అడ్డాగా మారింది. గ్రామంలో లక్షలు వెచ్చించి నిర్మించిన కూరగాయాల సముదాయాన్ని వినియోగంలోకి తేవాలని గ్రామస్థులు కోరుతున్నారు. అప్పుడు మాత్రమే ప్రభుత్వ లక్ష్యం నేరవేరుతుంది.

నిరుపయోగంగా మారిన కూరగాయాల షెడ్‌లను త్వరలోనే వినియోగంలోకి తెచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని రైతులకు అవసరమ్యే మౌలిక సదుపాయాలను కూడా కల్పిస్తామని మిరుదొడ్డి ఎంపీడీవో గణేష్‌రెడ్డిపేర్కొన్నారు.



నిరుపయోగంగా మారిన అల్వాల కూరగాయాల మార్కెట్

## డ్రంకెన్ డ్రైవ్‌లో 85 మందికి జరిమానా

సిద్దిపేట క్రైం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి):సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ తన సిబ్బందితో కొన్ని రోజుల నుంచి సిద్దిపేట పట్టణంలో నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీవో ఆఫీస్ చౌరస్తాలలో రాజీవ్ రహదారిపై వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ క్రమంలో 85 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతుండగా పట్టుకున్నారు. శనివారం సిద్దిపేట అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ వి. తరణి ముందు హాజరుపరచగా విచారణ చేసి 85 మందికి రూ. 72,600 జరిమానా విధించారు.

## ఇటిక్యాలలో ఇంటింటి సర్వే

జగదేవ్‌పూర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇటిక్యాల గ్రామంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు శనివారం ఇంటింటి సర్వే నిర్వహించారు. హైదరాబాద్‌లోని బేగంపేట మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు ఇటిక్యాలలో ఎన్ఎస్ఎస్ శిబిరం నిర్వహిస్తున్నారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించి ప్రజలకు డెంగ్యూ, విష జ్వరాలు, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ శిబిరాన్ని ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ విద్యాసాగర్ సందర్శించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ రావికంటి చంద్రశేఖర్, క్యాంపు కోఆర్డినేటర్‌లు ప్రసన్న, సరిత తదితరులున్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

గజ్వేల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లను ఈ నెల 15, 16 తేదీల్లో నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ నిఖత్ అంజూమ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్ పూర్తయిన విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికేట్లు, జిరాక్సులతో కళాశాలలో నేరుగా దరఖాస్తు చేసుకుని అడ్మిషన్లు పొందవచ్చని తెలిపారు. డిగ్రీ అడ్మిషన్లకు చివరి అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## విద్యుత్ షాక్‌తో మృతి చెందిన కుటుంబానికి చేయూత

మద్దూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : గాగిళ్లాపూర్ గ్రామంలో ఇటీవల ఏలూరి సాయిరామ్ వినాయకుని నిమజ్జనానికి ట్రాక్టర్ శుభ్రం చేస్తున్న క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన విషయం విధితమే. మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇట్టబోయిన కనకచంద్రం కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు 50 కేజీల బియ్యాన్ని అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరాముల వెంకటేష్, బండి గణేష్, ఏలూరి బాలకృష్ణ, ఈశ్వర్, వినయ్, స్వామి పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సిద్దిపేట రూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన శనివారం సిద్దిపేట రూరల్ మండలం రాంపూర్‌లో చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన ముదిగోండ అంజనేయులు(55) ముదు సంవత్సరాలుగా కడుపునోప్పితో బాధపడుతున్నాడు. ఎన్ని ఆసుపత్రులు తిరిగినా కడుపునొప్పి తగ్గకపోవడంతో ఈ నెల 2న గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు వెంటనే 108 వాహనంలో సిద్దిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కోడలు ముదిగోండ దీపిక ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

## రోడ్డు ప్రమాదం.. ఇద్దరికి గాయాలు

మిరుదొడ్డి, సెప్టెంబరు13 (ఆంధ్రజ్యోతి): మిరుదొడ్డి మండలం ధర్మారం గ్రామంలోని 765డీజీ జాతీయ రహదారిపై శనివారం ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. దుబ్బాక పట్టణానికి చెందిన నూనె అశోక్, సంపత్ సిద్దిపేట వెళ్లి తిరిగి దుబ్బాక వస్తుండగా ధర్మారం వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పి తీవ్రగాయాలు అయ్యాయి. దీంతో 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. గాయాలైన సంపత్, అశోక్‌లకు ప్రథమ చికిత్స చేసి సిద్దిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు

## వర్షానికి కూలిన ఇల్లు తృటిలో తప్పిన ప్రమాదం

రాయపోల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు రాయపోల్ గ్రామంలో ఓ పెంకుటిల్లు కూలిపోయింది. రాయపోల్ గ్రామంలో తుమ్మ రాణి కుటుంబానికి చెందిన పెంకుటిల్లు పైకప్పు తడిసిపోయింది. శనివారం ఇంటిలో పిల్లలు ఆడుకొని వెళ్లిన వెంటనే పై కప్పు కింద పడిపోయింది. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. అయితే ఇంట్లో ఉన్న సామాన్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. విషయమే రెవెన్యూ అధికారులకు కుటుంబ సభ్యులు సమాచారం అందించారు.

## విమోచన దినోత్సవాన్ని ఘనంగా జరపాలి

చేర్యాల/బెజ్జంకి సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఈనెల 17వతేదీన తెలంగాణ విమోచన దినోత్సవంతో పాటు ప్రధాని నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని రక్తదాన శిబిరాలతో పాటు విరివిగా మొక్కలు నాటాలని చేర్యాల బీజేపీ నాయకుడు డాక్టర్ కల్నల్ భిక్షపతి అన్నారు. చేర్యాల మండ లకేంద్రంలో శనివారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీతో సుస్థిర పాలన సాధ్యమని, ప్రధాని మోదీ నేతృత్వంలో దేశం అన్నిరంగాలలో అభివృద్ధిలో పురోగమిస్తుంద న్నారు. బీజేపీయే దేశ ప్రజలకు రక్ష అని తెలిపారు

### బెజ్జంకిలో

ప్రతి బూత్‌లో జాతీయ జెండాను ఎగురవేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సాయిని మల్లేశం పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో బీజేపీ మండలాధ్యక్షుడు కొలిపాక రాజు ఆధ్వర్యంలో మండల కార్యశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. సేవా పఖ్వాడా కార్యక్రమంలో భాగంగా రక్తదానం, చిత్ర లేఖన పోటీలు, మొక్కలు నాటడం, స్వచ్ఛభారత్ కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.



అంధకారంలో ఉన్న వై జంక్షన్

## అంధకారంలో వై జంక్షన్

కొమురవెల్లి, సెప్టెంబరు13 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మండలకేంద్రంలోని పలు ప్రధాన చౌరస్తాలతో పాటు నిత్యం రద్దీగా ఉండే వై జంక్షన్‌లో కూడా రాత్రిపూట స్తంభాలపై ఉన్న వీధి దీపాలు వెలగకపోవడంతో ప్రయాణికులు, భక్తులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వై జంక్షన్ గుండానే మల్లికార్జున స్వామి దర్శనానికి భక్తులు వస్తుంటారు. వెంటనే సంబంధిత అధికారులు హైమోస్ట్ లైట్లను ఏర్పాటు చేయాలని భక్తులతో పాటు స్థానికులు కోరుతున్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కోహెడ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బస్వాపూర్ గ్రామంలో 2003- 04 పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు శనివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మృతి చెందిన చిన్ననాటి స్నేహితులకు నివాళులు అర్పించారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన పూర్వపు ఉపాధ్యాయులు శంకర్, లక్ష్మయ్య, శాంతా శ్రీలత, దుర్గయ్య, మల్లయ్యలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆటలు, పాటలు వినోద కార్యక్రమాలతో ఉల్లాసంగా గడిపారు. పాఠశాలలో ఆనాటి మధుర స్మృతులను నెమరు వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎడబోయిన సత్తయ్య, తాటిపాముల శ్రీనివాస్, రవీందర్ ఉన్నారు.



కోహెడ మండలం బస్వాపూర్ హైస్కూలో 2003-04 బ్యాచ్ విద్యార్థులు

## తారు రోడ్డుకు ఇరువైపులా మట్టి

అక్కన్నపేట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అక్కన్నపేట మండలంలోని ఇటీవల వేసిన తారు రోడ్లకు పోసిన మట్టి కొట్టుకుపోయాయి. వెంటనే రోడ్లకు ఇరువైపులా మట్టి పొయ్యాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నాయకులు శనివారం ముంజ నాయక్ తండ వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు రామంచ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ మైసమ్మ వాగు తండా నుంచి కుందనవానిపల్లి కలిపే రోడ్డు, మంజ నాయక్ తండా నుంచి జనగామ రోడ్డు కలిసే రోడ్డు మట్టి వర్షానికి కొట్టుకపోయి తారు రోడ్డు కోతకు గురవుతుందని అవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తారు రోడ్లకు ఇరువైపులా మట్టి పోయించాలని డిమాండ్ చేశారు.

## బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి కన్నుమూత



శ్రీహరి(ఫైల్)

కోహెడ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శనిగరం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి కర్ర శ్రీహరి శనివారం రాత్రి కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్న ఆయన హైదరాబాద్ ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అక్కడే చనిపోయారు. సర్పంచ్‌గా రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన ఆయన అంచెలంచెలుగా ఎదిగారు. బీఆర్ఎస్, తెలుగుదేశం పార్టీలో వివిధ పదవులు నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ నుంచి నాటి ఇందుర్తి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. కర్ర శ్రీహరి 25 సంవత్సరాలుగా గ్రామ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ప్రజలకు సేవ చేశారు. కోహెడ ఎంపీపీ, జడ్పీటీసీ, సింగిల్ విండో చైర్మన్‌గా ఇలా ఎన్నో పదవులు చేసారు. సీనియర్ రాజకీయ నాయకులు కర్ర శ్రీహరి ఆకస్మిక మృతి పట్ల మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర ది్గ్భాంతి వ్యక్తం చేశారు.ఒక నిబద్ధతగా ప్రజల కోసం పని చేశారని గుర్తు చేసుకున్నారు. కర్ర శ్రీహరి మృతి పట్ల సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, వారి కుటుంబానికి మంత్రి పొన్నం ప్రభాకర్ తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

## కృతిక నక్షత్ర పూజలు



విద్యాధరి క్షేత్రంలోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో కృతిక నక్షత్ర పూజలు

వర్గల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : వర్గల్ విద్యాధరి క్షేత్రంలోని శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో కృతిక నక్షత్ర పూజలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధింతి నేతృత్వంలో ఉదయం దేవతా మూర్తులకు విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం దేవతామూర్తులను సర్వాంగా సుందరంగా అలంకరింపజేసి ప్రత్యేక పూజలు చేశారు. వేడుకల సందర్భంగా ఆలయంలో లక్ష పూల పూజ నిర్వహించారు.

## చిన్నకోడూరులో బీజేపీ మండల కార్యశాల

హుస్నాబాద్ /చిన్నకోడూరు, సెప్టెంబరు13 (ఆంధ్రజ్యోతి): చిన్నకోడూరులో బీజేపీ మండలాధ్యక్షుడు సూరగోని శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో శనివారం మండల కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా శేఖర్ గౌడ్ మాట్లాడుతూ.. ఈ నెల 17న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జన్మదినం, విశ్వకర్మ జయంతి, విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 17 నుంచి అక్టోబరు 2 వరకు సేవా పక్షం కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా దిశా కమిటీ మెంబర్ వనజ, బీజేపీ నాయకులు పర్శరాములు, బాపయ్య, నాగరాజు, మహేష్, సంతోష్, పర్శరాములు, నరేందర్, రాజేష్, కృష్ణ స్వామి, నరసింహ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పంట నష్టం.. 7 వేల ఎకరాలకుపైగా

(5వ పేజీ తరువాయి)

నారాయణరావుపేట మండల్లాలో వర్షం అతలాకుతలం చేసింది. దీంతో మొత్తం 91 గ్రామాల్లో, 2,600 మందికిపైగా రైతులకు చెందిన వ్యవసాయ భూముల్లో దాదాపు 7 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగి ఉండొచ్చని వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు.

### 270 ఎకరాల్లో ఇసుక మేట

వరద నీటి ప్రవాహంతో ఇసుక మేటలు చేరగా, దాదాపు 270 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. 200 ఎకరాల్లో వరి, 50 ఎకరాల్లో పత్తి, 20 ఎకరాల్లో కూరగాయల సాగుకు నష్టం వాటిల్లినట్లు సమాచారం. కాగా, ఇసుక మేటల ఎస్‌డీఆర్ఎఫ్ నిధులను వినియోగించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఉపాధిహమీ కూలీల ద్వారా ఇసుకను తొలగించి, తిరిగి పూర్తిస్థాయిలో వ్యవసాయం చేసుకునేలా భూమిని రైతులకు అప్పగించాలని ప్రభుత్వం భావిస్తున్నది.

### తుది నివేదికకు కసరత్తు

కేంద్ర నిబంధనల ప్రకారం భారీ వర్షాల కారణంగా 33 శాతం లేదా అంతకంటే ఎక్కువ పంట నష్టం జరిగితేనే ప్రభుత్వం నష్ట పరిహారం అందజేస్తుంది. అయితే, రాష్ట్ర ప్రభుత్వం పంట నష్టం జరిగిన వివరాలతో పాటు ఎన్ని గ్రామాల్లో, ఎంత మంది రైతులకు నష్టం వాటిల్లింది పూర్తి వివరాలను సేకరిస్తున్నారు. ఈ జాబితా ప్రకారం రూ.10 వేల చొప్పున సాయం అందించే అవకాశం ఉన్నది. ఈ మేరకు వ్యవసాయ శాఖ అధికారులు పూర్తిస్థాయిలో పంట నష్టం వివరాలను సేకరించి రాష్ట్ర ప్రభుత్వానికి తుది నివేదిక అందించేందుకు కసరత్తు చేస్తున్నారు.